కాకినాడ కలెక్టరేట్‌లో నేడు స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరుగుతుందని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఆగస్టు 29న మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్‌కు తెలియజేయవచ్చని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నత్తనడకన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

- నిధుల కొరతతో ఆలస్యం
- బిల్లుల విడుదలతో జాప్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు చాలా కీలకంగా ఉన్నాయి. కొన్ని సొంత భవనాల్లోనే నిర్వహిస్తుండగా ఇంకొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పలుచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో లబ్ధిదారులు, సిబ్బంది భయం భయంగా గడపాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది. పనులు ప్రారంభమై ఏడాది పైగా గడుస్తున్నా నేటికీ ఒక్క భవనం కూడా పూర్తి కాలేదు.

కాకినాడ జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మినీ అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 70 శాతం సొంత భవనాలుండగా మిగిలినవి అద్దె భవనల్లో కొనసాగుతున్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు ఉన్నారు. 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భవతులు ఉన్నారు. జిల్లాలో 1986 కేంద్రాల్లో 706 సొంత కేంద్రాలు ఉండగా 1107 అద్దె భవనాల్లో, రెంట్ ఫ్రీలో 173 నడుస్తున్నాయి.

రెండో దశ నాడు-నేడు పనుల్లో భాగంగా చేపట్టిన భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు మొదలై ఏడాది కావస్తున్నా నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదు. బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం కారణంగానే ఆలస్యం అవుతుందని అధికారులు చెప్పుకొస్తున్నారు.

తొండంగిలో నిర్మాణంలోనే ఉన్న భవనం

98 భవనాలు మంజూరు

నాడు నేడు రెండో విడతలో భాగంగా గతేడాది జూలై 26న 98 అంగన్వాడి నూతన భవనాలు మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.13.5 లక్షలు, ఫర్నిచర్ కోసం రూ 2.5 లక్షలు కేటాయించారు. పంచాయతీరాజ్, సమగ్రశిక్షాభియాన్, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖ ఇంజినీరింగ్ అధికారులతో పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిలో ఒక్కటి కూడా పూర్తి కాకపోగా 28 భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. 14 మాత్రమే స్లాబులు వేశారు. ఇంకా 56 భవనాలు రూఫ్ లెవెల్ (పైకప్పు స్థాయి) వరకూ మాత్రమే పూర్తయ్యాయి. వాస్తవానికి ఈ నెల జూన్ నాటికే అన్ని భవన నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. కిర్లంపూడి మండలం జెపి.నగరం, పాలెం, ఎస్సార్ పేట, వేలంక, ఉప్పరపేట, ప్రత్తిపాడు మండలం గర్జనపూడి,తొండంగి మండలం ఎ.కొత్తపల్లి, గడ్డిపేట, నరసరావుపేట, ఒంటిమామిడి, కె.కోదాడ, ఎ.అగ్రహారం తదితర ప్రాంతాల్లో పునాదులు దాటలేదు. జగ్గంపేట మండల కేంద్రంలో మార్కెట్, సీతానగరం, కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, గోనేడ, వేలంక, ఎస్ఎస్.లంక, పెద్దాపురం మండలం ఆర్‌బి.పట్నం, కట్టమూరు, ఆనూరు, వాలు తిమ్మాపురం తదితర ప్రాంతాల్లో స్లాబు దశ వరకు చేసి పనులు ఆగిపోయాయి. ఇలా అన్నిచోట్లా పనులు మధ్యలోనే ఉండిపోయాయి. సంవత్సరం కాలం గడిస్తున్న ఒక్కచోట కూడా పూర్తి కాలేదు.

రౌతులపూడి మండలం ఆర్‌వి.పురంలో స్లాబ్ వరకు మాత్రమే పూర్తయిన భవనం

నిధులు విడుదలలో జాప్యం

నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ప్రతి నెలా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో పలు భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. ఒక్కో భవనానికి రూ.13.5 లక్షలు కేటాయించగా కేవలం 15 శాతం అంటే రూ.2 లక్షల 40 వేలు మాత్రమే ఇప్పటి వరకు బిల్లులు మంజూరు చేశారు. దాంతో పనులు చేయలేక, చేసేదేమీ లేక మధ్యలో నిలిపివేశామని నిర్మాణదారులు చెబుతున్నారు.

త్వరలోనే పనులు పూర్తయ్యే అవకాశం

అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నిధుల విడుదలలో ఎటువంటి జాప్యం లేదు. అతి త్వరలోనే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

- ప్రవీణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్.

సామర్లకోటలో మంత్రి గుడివాడ పర్యటన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం పర్యటించారు. తొలుత పెద్దాపురం ఎడిబి రోడ్ లోని రాక్ సిరామిక్ టైల్స్ కంపెనీని ఆయన సందర్శించారు. టైల్స్ తయారీ, మార్కెటింగ్, నాణ్యత వంటి అంశాలను పరిశీలించారు. సిరామిక్స్ కంపెనీ ప్రతినిధులు మంత్రికి సాదర స్వాగతం పలికారు. కంపెనీలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. అనంతరం స్థానిక 28 వార్డు గాంధీనగర్‌లో ఉన్న మంత్రి పరిచయస్తుడు జన్మయంతి రోహిత్ సమథ్ కుటుంబంతో కొంత సమయాన్ని గడిపారు. అనంతరం మంత్రి అమర్నాథ్ స్థానిక జి.రాగంపేట జగనన్న లే అవుట్ ను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న గృహాల

జగనన్న కాలనీలో పనులను

నిర్మాణాలను మౌలిక సదుపాయాల ఏర్పాట్లు మంత్రి అమర్నాథ్‌కు దవులూరి దొరబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఊబా జాన్ మోసెస్, నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్స్‌లు రెడ్నం సునీత దొరబాబు, పాగా సురేష్ కుమార్, పితాని కృష్ణ, సేపేని సురేష్, జట్లా మోహన్, సచివాలయాల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, చిట్టిమాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా నేత్రదాన పక్షోత్సవాలు

కాకినాడ రూరల్ : మన శరీరంలో కొన్ని అవయవాలు లేకున్నా రోజులు గడపవచ్చని కానీ కంటి చూపు లేకపోతే మాత్రం అంధకారమేనని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మరణానంతరం మాత్రమే కంటి నుంచి కార్నియాలను తొలగించి వివిధ కారణాలతో కంటి చూపు కోల్పోయిన వారికి అవి అమర్చడం వల్ల కంటి చూపు వస్తుందన్నారు. సంవత్సరం వయసు నుండి ఏ వయసు వారైనా నేత్రదానం చేయవచ్చని చెప్పారు.

మెడికల్ రిప్స్ సంఘటితంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి-కాకినాడ

మెడికల్ రిప్స్ సంఘటితంగా ఉద్యమించి, హక్కులు కాపాడుకోవాలని ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సి.వెంకట్రావు పిలుపు ఇచ్చారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో యూనియన్ కాకినాడ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు ఎం.ఎ.స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా యూనియన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా విశిష్టమైన సేవలు అందించిన డిపి.దూబేకు నివాళు లర్పించారు. మారిన ఉపాధి పరిస్థితులు - కార్మికుల కర్తవ్యం అనే అంశంపై వెంకట్రావు ప్రసంగించారు. ముందుతరం నాయకులు ఎన్నో త్యాగాలు చేసి సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్‌కు హక్కులు సాధించారని చెప్పారు. నేటితరం ఆత్మగౌరవంతో విధులు నిర్వహించాలన్నారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

దుంపల ప్రసాద్, నగర యూనిట్ కార్యదర్శి ఎఆర్‌సి.వర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మారుస్తుందన్నారు. చరణ్, రామకృష్ణ, సతీష్ బాబు, శ్యామ్ కుమార్, వెంకటేష్, అప్పారావు, నరేష్, సత్య శ్రీనివాస్, హుస్సేన్, కిశోర్, అశోక్, సతీష్, ప్రసాద్, అయ్యప్ప, షంసుద్దీన్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను అందరూ రక్షించుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం వారందరిపై ఉందని జన విజ్ఞాన వేదిక నాయకులు బి.అనంతరావు అన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆదివారం సాయంత్రం సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వాడుక భాషను పుస్తకభాషగా మార్చడంలో గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని ఆయన వివరించారు. మాతృ భాషను పరిరక్షించుకోవాలని ఆవశ్యకతను గురించి ఆయన వివరించారు. ఈ సభలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, ఉప్పేటి రవి, జయశ్రీ, అజయ్ కుమార్, దేవత రాజేష్ కుమార్, కూనిరెడ్డి అరుణ, నేహాలక్ష్మి, రొంగల అరుణ్ కుమార్, దారపరెడ్డి కృష్ణ, ఆర్.వీర్రాజు ప్రసంగించారు.

సత్యదేవుని ఆలయంలో కేంద్ర మంత్రి భగవత్

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామిని ఆదివారం కేంద్ర ఎరువులు రసాయనాల సహాయ మంత్రి భగవత్ క్యూబా దర్శించుకున్నారు. మంత్రికి దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్ ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సత్యదేవుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వేద ఆశీస్సులు నిర్వహించారు. దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్ స్వామి జ్ఞాపికను, ప్రసాదాన్ని

అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం రిసెప్షన్ అధికారి పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పిఎంపిల సంఘం నూతన కమిటీ ఎన్నిక

తాళ్లరేవు : పిఎంపి అసోసియేషన్ తాళ్ళరేవు, యానాం మండలాల నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌హాల్లో నిర్వహించారు. తాళ్ళరేవు కమిటీ అధ్యక్షులుగా కెఎస్.ప్రసాద్, కార్యదర్శిగా రహమాన్ షరీఫ్, కోశాధికారిగా సిహెచ్.మోహన్, యానాం నూతన కన్వీనర్‌గా చిక్కాల శ్రీనివాస్, కో కన్వీనర్స్‌గా ఎస్.రాంబాబు, డి.త్రిమూర్తులును ఎన్నుకున్నారు.

అన్ని వర్గాలనూ మోసగించిన వైసిపి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రాష్ట్రంలో అన్ని వర్గాల వారినీ వైసిపి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు అన్నారు. ఆదివారం మన్యంవారిపాలెంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో మహిళా శక్తి పథకాల కరపత్రాలు మహిళలతో కలిసి ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అమ్మ ఒడి ఎంత మంది బిడ్డలు చదువుకుంటే అంతమందికి తల్లుల ఖాతాలో వేస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చాక రూ.15 వేలు వెయ్యకుండా కేవలం ఒక్క బిడ్డకు మాత్రమే రూ.13 వేలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పైడిపాల

కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సూరిబాబు, కొత్త కొండబాబు, రేఖ బుల్లిరాజు, సుంకవిల్లి రాజు, పోట్రు కృష్ణ, బొడ్డు బుజ్జి, మీసాల సత్తిబాబు, పోట్రు రాముడు, తురిబిల్లి నాగేశ్వరావు, మరోతి సూర్య చంద్ర పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.



సోములును సత్కరిస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎ సోములకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గంపేట

విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు సోములు 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తోటి విఆర్‌ఎలు ఆదివారం ఘనంగా సత్కరించారు.. ఈ సందర్భంగా ఆయన విఆర్‌ఎగా అందిస్తున్న సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్ ఇశ్రాయేలు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన బాబూజీ, డివిజన్ సహాయ కార్యదర్శి వార చిట్టిబాబు, కలిదిండి అర్జునుడు, పోసిపోయిన ఇస్సాకు, కింతాడ ప్రభావతి, పాల్గొన్నారు.

జాన్‌వెస్లీకి ఘన సన్మానం

ప్రజాశక్తి-జగ్గంపేట

రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్గా నూతనంగా నియమితులైన జాన్ వెస్లీని జగ్గంపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ఆదివారం ఘనంగా సన్మానించారు. చర్చ్ పాస్టర్ జొన్నకూటి రాజు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో వెస్లీని ఘనంగా సత్కరించారు. క్రిస్టియన్ల అభివద్ధికి కృషి చేస్తానని వెస్లీ అన్నారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చ్ పిసిసి, ఎల్ సిసి సభ్యులు, సంఘస్తులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రైట్‌అప్ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దశ్యం

టిడిపిలో వీర్రాజు చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని మన్యంవారిపాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు మాజీ సర్పంచ్ గాది వీర్రాజు ఆదివారం టిడిపిలో చేరారు. ఆయనకు రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రంకండువా వేసి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివద్ధి పరిచే సత్తా ఉన్న నాయకుడు జ్యోతుల నెహ్రూ అని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి పరిచి భవిష్యత్తు గ్యారంటీ ఇస్తున్న చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుస్తూ టిడిపిలో చేరుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, సుంకవిల్లి రాజు, పోట్రు కృష్ణ, బొడ్డు బుజ్జి, మీసాల సత్తిబాబు, పోట్రు రాముడు, తురిబిల్లి నాగేశ్వరరావు, మరోతి సూర్య చంద్ర, తంగెళ్ల పెద్ద అప్పన్న, కర్నాటి సూరిబాబు, గండికోట నాగరాజు, పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజాశక్తి-పిఠాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యం అవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపు ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆదివారం స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో ప్రారంభమయ్యాయి. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు జి.రాము ఆవిష్కరించారు. అనంతరం ప్లీనరీలో అశోక్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యార్థులకు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్ల ప్రజాధనంతో వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నామని పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటోందని, ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలల్లో సీట్లు అమ్ముకునేందుకు 107, 108 ఉత్తర్వులు తీసుకొచ్చారని విమర్శించారు. ఈ సీట్ల అమ్మకం భవిష్యత్తులో అన్ని కళాశాలల్లో అమలు చేస్తారన్నారు. ఇది వైద్య విద్య పేదలకు దూరం చేయడమేనని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు ద్రోహం చేసినట్లే అన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్యలో విప్లవాత్మమైన మార్పులు అంటే బలహీన వర్గాల ప్రజలకు విద్యను దూరం చేయడమేనా అని ప్రశ్నించారు. పిఠాపురంలో డిగ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

కళాశాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు నివేదిక ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వరహాలు, శ్రీకాంత్, కృప, దినేష్, సిద్ధు, వెంకటేష్, లోవరాజు, మణికంఠ, అరుణ్, గోపాల్, శివ, సంజయ్ పాల్గొన్నారు.

ముగిసిన విద్యార్థుల శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన ఎడబ్ల్యుఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. వి.అనిల్ ఆరు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, ఐటి విభాగాధిపతి డాక్టర్ ఎం.రాజేష్, కో ఆర్డినేటర్, డి.చిరంజీవి, ఎం.రాజబాబు పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధిలైటు

పట్టపగలే వీధిలైట్ల వెలుగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పరదేశమ్మ కాలనీలో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. అనేక ప్రాంతాల్లో రాత్రి సమయంలో కూడా వీధిలైట్లు వెలగడం లేదు.కొన్ని వీధుల్లో మాత్రం పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయి. పట్టణ పరిధిలోని అన్ని వీధుల్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో రాత్రి సమయంలో వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు తరుముతున్నాయి. పట్టణ పరిధిలో వీధిలైట్ల నిర్వహణపై పర్యవేక్షణ లోపం వల్లనే ఇలా జరుగుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. సచివాలయాల పరిధిలో వీధిలైట్ల నిర్వహణపై పర్యవేక్షణ పటిష్టంగా అమలు చేసి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలపై ఎంఎల్‌ఎ పొన్నాడకు వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పలు సమస్యలపై మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ ఎంఎల్ఎతో మాట్లాడారు. గాడిమొగ పంచాయతీ బాబా నగర్‌లో శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం స్థలం కేటాయించిన స్థానికులు అడ్డు తగులుతున్నారని, అధికారికంగా శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాళ్ళరేవు అంబేద్కర్ భవనం పైఅంతస్తు నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. టిటిడి పాలక మండలి సభ్యునిగా నియమితులైన ఎంఎల్ఎ సతీష్ కుమార్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, రెడ్డిబాబు, ప్రధాన కార్యదర్శి తాడి షణ్ముఖరాజు, నేరేడిమెల్లి స్వామి, పెయ్యల అంబేద్కర్, దడాల ప్రసన్న కుమార్, పాతకోరంగి, తోటపేట, తాళ్లరేవుకు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు గ్రామ దేవత పరదేశమ్మ వారి తీర్థం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం, పరదేశమ్మ వారి వీధి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో పరదేశమ్మ వారి వీధి ప్రజలతో కిటకిటలాడింది ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద బారులు తీరి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గరగ నృత్యాలతో కొత్త అమ్మవారిగా అలంకరించిన పరదేశమ్మ ఊరేగింపు వైభవంగా జరిగింది.

టిడిపి సీనియర్ నేత సూరిబాబు మృతి

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని ఎ.మల్లవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పల్లి సూరిబాబు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ములగపూడి సర్పంచ్‌గా, రౌతులపుడి సొసైటీ అధ్యక్షునిగా, టిడిపి మండల అధ్యక్షునిగా ఆయన పని చేసారు. ప్రస్తుతం టిడిపి యూనిట్ ఇన్చార్జిగా పని చేస్తున్నారు. సూరిబాబుకు ఎంపిపి పర్వత రాజబాబు, భాస్కర్ బాబు, టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, సాంబశివరావు, సత్యనారాయణ, ఎంపిటిసి సోమ రౌతు రవి నివాళులర్పించారు. సూరిబాబు మృతికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ సంతాపం తెలిపారు.

కార్టూ'నిజం'



చందమామను అందుకున్న వారికి జీతాలు అందటం లేదట!

నాటకంలోని ఒక సన్నివేశం

ముగిసిన నవరస వార్షికోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నత్యాలు, ఆలోచింపజేసిన నాటికలతో ఆదివారం దంటు కళాక్షేత్రం కళాకారులతో కలకలలాడింది. నటీనట వర్తమాన రంగస్థల సమాఖ్య 59వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కాకినాడ దంటు కళాక్షేత్రంలో కూచిపూడి నృత్యాలు, బుర్రకథ, నాటికలు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గరికపాటి నమశ్శివాయ, గోపాల్ అధ్యక్షత వహించగా మార్ని జానకిరామ చౌదరి కార్యక్రమాన్ని నడిపించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు కళాకారులను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ నవరస ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా కొన్ని అన్న వారి కారణాలవల్ల కార్యక్రమాలు నిర్వహించామని, తిరిగి యథావిధిగా ప్రతి సంవత్సరం కళాకారులను సన్మానించుకుంటూ నాటికలు ప్రదర్శిస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామ శివారులో ఆదివారం పేకాట శిబిరంపై ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,400, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం తుమ్మలపల్లి సెంటర్ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులది అల్లవరం మండలం గుండేపూడి, కొమరగిరిపట్టణానికి చెందిన వడ్రంగి మేస్త్రిలుగా స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని వేమగిరి జాతీయ రహదారిలో రత్న ప్లాస్టిక్స్ ఫ్యాక్టరీ సమీపాన ఖాళీ స్థలంలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సిఐ పివిజి.తిలక్ తెలిపారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉంటుందని, తల, నుదురు, కళ్లపై గాయాలు ఉన్నాయని, పక్కనే రక్తపు మరకలతో రాయి ఉందని సిఐ తెలిపారు. స్థానిక విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సిఐ తెలిపారు.

పుస్తకాలు చదువుతున్న బాలలు

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుతాం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద్ పార్కులోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం పాఠశాల విద్యార్థులతో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వారితో అక్బర్ బీర్బల్ కథలు, జాతక కథలు, వేమన శతకం, బొమ్మల రామాయణం, అరేబియన్ నైట్స్ తదితర కథలను లైబ్రేరియన్ శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులకు కథలు చదవడంలో పోటీలు నిర్వహించారు. వారికి బహుమతులు ఇచ్చి పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

2, 3న విజయవాడలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలను కాకినాడ నగరంలో ఆదివారం బిసి నాయకులు కుండల సాయి కుమార్ యాదవ్, చొల్లంగి వేణుగోపాల్, గంపల రాజు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గుంటూరు – విజయవాడ జాతీయ రహదారి మంగళగిరిలోని డిజిపి కార్యాలయం ఎదురుగా ఉన్న హ్యాపీ రిసార్ట్‌లో ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడులకు చెందిన సుమారు 500 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయన్నారు. సుమారు 50 వేల మంది నిరుద్యోగులు వారి అర్హతలను బట్టి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. జాబ్ మేళాకు హాజరైన వారికి ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కోటనందూరు

శ్రీ రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995–99 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం శ్రీ తలుపులమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. సుమారు 25 సంవత్సరాలు క్రితం శ్రీ రాజా ప్రభుత్వ పాఠశాలలో చేరి ఇంటర్మీడియట్ వరకు అదే ప్రాంగణంలో ఉపాధ్యాయుల సూచనలు సలహాలతో ముందుకు సాగారు. పూర్వ విద్యార్థులుగా తమ పాఠశాలకు తప్పకుండా తమ సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని పాఠశాల విద్యార్థులతో కలిసి సేవా కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పప్పు సుమన్, పోర్రాజు, ప్రగడ ప్రకాష్, నాయుడు, బొదపాటి శ్రీను, ప్రవీణ్, విస్వరాజ్ అల్లు, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళలకు అనూస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలం ర్యాలి గ్రామంలో స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు బ్యూటీ పార్లర్, కుట్టు మిషన్, సారీ పెయింటింగ్, కంప్యూటర్ వంటి స్కిల్ డెవలప్మెంట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనర్ దొమ్మేటి శారదా లక్ష్మీ కుమారి ఈ శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించి మహిళలకు వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అను స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు అన్నపూర్ణ తెలిపారు.

పారదర్శకంగా పథకాల అమలుకు కృషి

డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింట్లో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) పీడీ కె.శ్రీరమణి అన్నారు. పింఛన్లు పంపిణీ, స్త్రీ స్వయం సహాయ బృందాల ఏర్పాటుకి ప్రోత్సాహం, వాటి పనుల అనుసంధానం, ప్రపంచ బ్యాంకు సహాయంతో పేదరిక నిర్మూలనా పథకం నిర్వహణ వంటి ముఖ్యమైన పనులను నిర్వహిస్తున్నామన్నారు. పథకాలన్నీ లబ్ధిదారులకు పారదర్శకంగా, సకాలంలో అందజేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

పింఛను పథకం ఎలా అమలవుతోంది.?

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పింఛను పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. పింఛన్లు పంపిణీలో ప్రతి నెలా మొదటి స్థానంలో ఉంటున్నాం. కాకినాడ జిల్లావ్యాప్తంగా అత్యధికంగా 2,72,056 మందికి రూ.74.86 కోట్లు నెలవారీగా అందజేస్తున్నాం. ఒకటో తేదీకే పింఛన్లు అందజేయాలన్న లక్ష్యంతో నెలాఖరుకు బ్యాంకుల్లో నగదు జమ అయ్యేలా డిపాజిట్ చేస్తున్నాం.

దరఖాస్తు చేసుకున్న ఎన్ని రోజుల్లో పింఛను ఇస్తున్నారు.?

పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న 21 రోజులకే మంజూరు చేస్తున్నాం. ఒకవేళ తగిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, వయసు సరిపోకపోవడం వంటి దరఖాస్తులను తిరస్కరిస్తూనే తగిన వివరణ ఇస్తున్నాం. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర అర్హులు సంబంధిత సచివాలయం నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. పెండింగ్‌లో ఉన్న పింఛన్ల పునరుద్ధరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వివిధ కారణాలతో కొన్ని పింఛన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

వైఎస్ఆర్ ఆసరా పథకం ఎన్ని సంఘాలకు ఎంత మొత్తం చెల్లించారు.

జిల్లావ్యాప్తంగా 29,359 వేల సంఘాలకు మంజూరు అయ్యాయి. మూడో విడతగా రూ.241.22 కోట్లు చెల్లించాం. మరో విడత ఆయా సంఘ సభ్యుల ఖాతాల్లో నేరుగా నగదు జమ కానుంది. 2019 ఏప్రిల్ 11 నాటికి బ్యాంకుకు చెల్లించిన రుణం మొత్తాన్ని ఇలా నాలుగు విడతల్లో ప్రభుత్వం చెల్లిస్తోంది.

జగనన్న తోడు పథకం ఎలా అమలవుతోంది.

సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈ పథకం అనేకమందికి చాలా ఉపయోగపడుతుంది. చిరువ్యాపారం, గ్రామీణ సంప్రదాయ వృత్తులు చేసుకునేందుకు సున్నా వడ్డీకే రూ.10 వేలు మంజూరు చేస్తున్నాం. స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఈ పథకానికి 18 ఏళ్లు నిండినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర పథకాలతో లింకంటూ ఏమీ లేదు. జిల్లాలో తొలి విడతలో 40,642 మందికి ఈ పథకంలో బ్యాంకు ద్వారా ఇప్పటి వరకు రుణాలు అందజేసాం. స్త్రీ నిధి ద్వారా 22,024 రుణాలు పంపిణీ చేసాం.

వైఎస్ఆర్ బీమా వల్ల ప్రయోజనమేంటి..

18 నుంచి 70 ఏళ్లలోపుగల స్త్రీ, పురుషులకు ఈ పథకం వర్తిస్తుంది. ప్రస్తుతం గ్రామ సచివాలయ వాలంటీర్ల ద్వారా నమోదవుతోంది. బీమా ప్రీమియం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. వివరాలిచ్చి నమోదు కావడమే లబ్ధిదారుని వంతు. 50 ఏళ్లలోపు గలవారు సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే రూ.5 లక్షల చొప్పున అందుతుంది. 51 ఏళ్లు పైబడి 70 ఏళ్ల లోపుగల వారు సహజంగా మరణిస్తే ఏమీ రాదు. ప్రమాదంలో మరణిస్తే రూ.3 లక్షలు అందుతుంది.

డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం ఎంత వరకు వచ్చింది.

ఈ ఆర్థిక సంవత్సరం 2022–2023కు గాను సెర్ప్ వారు జిల్లాలో 25,869 సంఘాలకు రూ.1004.81 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు (జూన్ 2023 నాటికి) సాధించిన ప్రగతి 423 సంఘాలకు రూ.42 65 కోట్లు బ్యాంక్ లింకేజి రుణాలు ఇప్పించి 4.25 శాతం ప్రగతి సాధించాం.

వైఎస్ఆర్ కళ్యాణమస్తు ఎలా అమలవుతుంది.?

ఎపి ప్రభుత్వం పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు, భవన నిర్మాణ కార్మికులకు పిల్లలు పెళ్లి ఖర్చుల నిమిత్తం పెళ్లి కుమార్తె తల్లి ఖాతాకు సొమ్మును జమ చేస్తాము. ఈ కార్యక్రమాన్ని 'వైఎస్ఆర్ కళ్యాణ మస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా' పేరుతో ఈ పథకాన్ని 2022 అక్టోబర్ 1న ముఖ్యమంత్రి ప్రారంభించారు. పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడు పదో తరగతి పాస్ అయి ఉండాలి. పెళ్లి కుమార్తెకు వివాహ వయస్సు 18, పెళ్లి కుమారునికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.లక్ష, ఎస్‌సి, ఎస్‌టిలు ఇంటర్ క్యాస్ట్ వివాహం చేసుకుంటే రూ. 1.20 లక్షలు, బిసిలకు రూ.50 వేలు, బిసి కులాలకు చెందిన వారు ఇంటర్ క్యాస్ట్ వివాహం చేసుకుంటే రూ.75 వేలు, మైనారిటీలకు, విభిన్న ప్రతిభావంతులకు రూ.లక్ష, రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ.40 వేలు లబ్ధి ఉంటుంది.

సొంత ఖర్చుతో పూడిక తీసుకుంటున్న రైతులు

పుష్కర కాలువలో ఇసుక మేటలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల కురిసిన అరకొర వర్షాలకే వాలు తిమ్మాపురం నుంచి కొండపల్లి వెళ్లే రహదారిలో ఉన్న పుష్కరకాలవ ఇసుక మేటలు వేసింది. దీంతో పుష్కర కాలువ ద్వారా సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా పుష్కర రైతులు పుట్టా సోమన్న చౌదరి, సాల్మన్ రాజు, కంటిపూడి విష్ణు, సత్యనారాయణ మాట్లాడారు. ఎర్రంపాలెం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా వాలుతిమ్మాపురం, రాయభూపాలపట్నం, కొండపల్లి, చినబ్రహ్మదేవం, మర్రిపూడికి సంబంధించి 13 కిలోమీటర్ల పొడవునా పుష్కరకాలువను నిర్మించారన్నారు. ఈ కాలువ నీటి ద్వారా మెట్ట రైతులు తమ పొలాల్లో పంటలు పండిస్తున్నారన్నారు. ఇటీవల కురిసిన అడపా తడపా వర్షాలకే వాలుతిమ్మాపురం, సూరంపాలెం మెట్టల నుండి కొట్టుకు వచ్చిన ఇసుక మేటలు వేయటంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికే రైతులు తమ సొంత సొమ్ముతో కొంతమేర ఇసుక మేటలను తొలగించారన్నారు. శనివారం కురిసిన వర్షానికి మళ్లీ కాలువ పూడుకు పోయిందన్నారు. ఈ గ్రామాల్లో 50 శాతం కూడా వరి నాట్లు పూర్తి కాలేదన్నారు.

మహేష్‌ను సత్కరిస్తున్న సభ్యులు

కవి మిరప మహేష్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-జగ్గంపేట

జగ్గంపేటకు చెందిన కవి మిరప మహేష్‌ను పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఘనంగా సన్మానించారు. అంబేద్కరిజంపై రాష్ట్రస్థాయి చర్చాగోష్టి ఆదివారం నిర్వహించారు. మిరప మహేష్ ఈ సభలో అతిథి ఉపన్యాసం చేశారు. అంబేద్కర్ సంస్కరణలు, సిద్ధాంతాలకు ప్రాధాన్యతనిస్తూ బౌద్ధ మార్గంలో ఉన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం అనే అంశాలను అనుచరించి అంబేద్కర్ మార్గంలో దళిత బహుజన వర్గాలు రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. దేవుడు కేంద్రంగా మనుషుల మధ్య చిచ్చులు పెడుతున్న మతాల స్థానంలో భౌద్ధమే శరణ్యమని తెలిపారు. సభ అనంతరం మిరప మహేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లుకు చెందిన ముడకల నాగేంద్ర ప్రసాద్, ముత్యాలరాజు, గోపాలరావు, సహజకవి మోకా రత్నరాజు, భేతాళ సూదర్శనరావు, శివాజీ, జైభీమ్ చంద్ర పాల్గొన్నారు.

యానాం వార్తలు

ప్రశాంతంగా ఎల్‌డిసి రాత పరీక్ష

ప్రజాశక్తి - యానాం

లోయర్ డివిజన్ క్లర్కు (ఎల్‌డిసి), స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి సంబంధించి యానాంలో ఆదివారం రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 165 ఎల్‌డిసి, 55 స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు యానాంలో 2825 మంది దరఖాస్తు చేయగా, 403 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని అధికారులు తెలిపారు. స్థానికంగా 10 పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామి ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్లు, పరీక్ష నిమిత్తం పుదుచ్చేరి నుంచి యానాం వచ్చిన ప్రత్యేక అధికారులు పర్యవేక్షించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఈ పరీక్షకు 46,904 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా యానాం, పుదుచ్చేరి, కారైకాల్, మాహేలో మొత్తంగా 137 కేంద్రాలను ఏర్పాటు చేశారు.


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జనార్ధన్

పుస్తకాన్ని మించిన మార్గదర్శి లేదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పుస్తకాన్ని మించిన మార్గదర్శి లేదని మధ్యప్రదేశ్ అడిషనల్ డిజిపి జి.జనార్ధన్ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని గాంధీభవన్‌న సందర్శించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ గాంధీభవన్ నిర్వహణ ఎంతో బాగుందని ప్రశంసించారు. తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉండడానికి ఎంతో కష్టపడ్డానని, జీవితంలో ఎదగడానికి క్రమశిక్షణ అవసరమని చెప్పారు. తాను చాలా చిన్న కుటుంబం నుంచి వచ్చానని, అవకాశాలని అనుకూలంగా మార్చుకుంటూ ఎదగాలని సూచించారు. పుస్తకాన్ని వదలకూడదని, పుస్తకం మనకెన్నో అందిస్తుందని చెప్పారు. గాంధీభవన్ అధ్యక్షులు ఎల్.గాంధీ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, అల్లూరి సురేంద్ర, రామకృష్ణ, దోసగిరిరావు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న మానవతా సభ్యులు

పక్షవాత బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

పక్షవాతంతో బాధపడుతూ రెండేళ్లుగా మంచానికే పరిమితమైన పెద్దేవం గ్రామానికి చెందిన బోడపాటి వెంకటరత్నంకు మండల మానవతా శాఖ రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించింది. కుటుంబ పోషణ, వైద్య ఖర్చుల కోసం బాధపడుతున్న విషయాన్ని మానవతా శాఖ తెలుసుకుని ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ అధ్యక్షులు సాయన సుబ్బారావు, రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, కార్యదర్శి టి.దోసెయ్య కోశాధికారి ఎవి.హనుమంతరావు, ఇసి సభ్యులు సనపల రాజశేఖర్, కన్వీనర్ జి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఎల్‌వి ప్రసాద్ నేత్రాలయం స్థాపించి మెరుగైన వైద్య సేవలు అందించడమే అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కపిలేశ్వరపురంలోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్, గొడవర్తి సత్యనారాయణమూర్తి కంటి వైద్య కేంద్రంలో ఆదివారం 12వ వార్షికోత్సవం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి వైస్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, సెకండరీ సెంటర్స్ హెడ్ జోజి ప్రసాద్ స్థానిక సెంటర్ హెడ్ వాసు బాబు తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఐ కేర్ సెంటర్ డోనర్ గొడవర్తి సత్య నారాయణ మూర్తి , నాగమణి దంపతులను, కుమారుడు వీరభద్ర చౌదరీలను, అభినందించారు. 2011లో ప్రారంభమైన ఈ కేంద్రం అంచలంచెలుగా దినాభివద్ధి చెందుతూ అత్యాధునిక టెక్నాలజీతో ప్రతినిత్యం ఎందరికో వైద్య సేవలు అందిస్తున్న ఈ కేంద్రంలో ఈ ఏడాది జూలై వరకు 12,500 మందికినేత్ర వైద్య సేవలు, 1,350 మందికి కేటరాక్ట్ చికిత్సలు, అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే వచ్చే ఏడాది 1,850 మందికి కేటరాక్ట్ చికిత్సలు అందించాలన్న లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ ,ఆసుపత్రి వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యాలయంలో జరిగిన కేక్ కటింగ్ లో పాల్గొన్న ఆసుపత్రి నిర్వాహకులు

'తాపేశ్వరం' రోడ్డు పూర్తి చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి-మండపేట

అధ్వానంగా మారి ప్రమాదాలకు నెలవుగా ఉన్న తాపేశ్వరం – ద్వారపూడి రోడ్డు పూర్తి చేసేవరకూ పోరాటం తప్పదని జెఎసి నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని ఇప్పనపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన జెఎసి సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ మండపేట ద్వారపూడి రోడ్డు పనులు సగంలో నిలిచిపోవడంతో ప్రయాణికులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో ప్రభుత్వ అలసత్వం వాహనదారుల పాలిట శాపంగా మారిందన్నారు. ఈ రోడ్డు పై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు, వాహనదారులు రోడ్డుకు రెండు పక్కల వున్న గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నప్పటికి అధికారులకు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజల శ్రేయస్సును దష్టిలో వుంచుకొని రోడ్డు అభివద్ధి పనులు పూర్తి చేయకుంటే వ్యాపారులు, ప్రజలు, ప్రజా సంఘాల నాయకులతో కలసి దశలవారీగా ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల, పార్టీల నాయకులు

సిఐగా రాముకు ఉద్యోగోన్నతి

అభినందనలు తెలిపిన మొగలికుదురు గ్రామస్తులు

ప్రజాశక్తి -మామిడికుదురు

మొగలికుదురు కి చెందిన సాల లక్ష్మి సోమేశ్వర రావు (రాము) కు విజయవాడ డివిజన్ సిఐ గా ఉద్యోగోన్నతి రావడం పై ఆదివారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మొగలికుదురు లోని ఆయన స్వగహం వద్ద పండగ వాతావరణం నెలకొంది. నందిగాం టౌన్ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన ఆయన ఉద్యోగోన్నతితో సిఐగా బాధ్యతలు తీసుకోనున్నారు. రాముకు కతజ్ఞతలు తెలుపుతూ తాటిపాక, మొగలికుదురు కూడలిలో ఆయన అభిమానులు, స్థానికులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాము దంపతులను బంధు మిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు మల్లవరపు మధు బాబు, మట్ట రవి, దొంగ రవి చంద్ర, ఘంటా ప్రశాంత బాబు, తోలేటి సత్యనారాయణ పూల మాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

రామును సత్కరిస్తున్న స్నేహితులు

న్యాయవాది అంబేద్కర్ చిత్రపటానికి నాయకుల నివాళి

న్యాయవాది పెట్టా అంబేద్కర్‌కి ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

పెట్టా అంబేద్కర్ 3వ వర్ధంతి కార్యక్రమం మట్టా వెంకట్రావు అధ్యక్షతన ఆదివారం ఈదరపల్లి లో జరిగింది. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెట్టా అంబేద్కర్ సేవలను పలువురు కొనియాడారు. బుద్ధిష్టుగా, అంబేద్కర్ సిద్ధాంతాలను అనుచరించేవారుగా ఉండేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో పరమట రాంప్రసాద్, అయినవిల్లి జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా శ్రీనివాసరావు, నేరేడుమిల్లి సత్యనారాయణ, పోతుల సుభాష్ చంద్రబోస్, గూటం సాయి, జె.రాజ్ కుమార్, గోసంగి బంగార్రాజు, గెడ్డం ప్రదీప్, జె.భీమారావు, బూల విజయ్, డి.రాజారావు, రొక్కాల శ్రీనివాసరావు, కుసుమ శ్రీనివాసరావు, బాలకష్ణ, బీర రవికుమార్,మంగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

29న మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మునిసిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశంలో చర్చించబోయే అంశాల అజెండాను విడుదలచేసారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామం నుంచి రామచంద్రపురం వెళ్లే మెయిన్ రోడ్ ఐదేళ్లుగా పాడై అభివద్ధికి నోచుకోకుండా ప్రమాదకరంగా ఉంది. రూ.15 కోట్లు మంజూరైన ఈ రోడ్డు భారీ గోతులు ఏర్పడి పలు ప్రమాదాలకు నిలయంగా మారింది. ద్రాక్షారం నుంచి యానాం వరకు 27 కిలోమీటర్లు ఉన్న ఈ మెయిన్ రోడ్డు రామచంద్రపురం ద్రాక్షారామ యానాం వరకు నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షం వస్తే రామచంద్రపురం బీర్ ఫ్యాక్టరీ వద్ద నుంచి తాళ్లపాలెం, జగన్నాయకులు పాలెం, గున్నయ్య తూము నుంచి హై స్కూల్ వరకు, అన్నాయి పేట నుంచి వేగాయమ్మపేట వరకు, ఎర్ర పోతవరం నుంచి బాలాంతరం వరకు, అదేవిధంగా కోలంక నుంచి ఇంజరం వరకు రోడ్డు బాగా పడి గోతులు ఏర్పాడ్డాయి. వర్షం వస్తే ఈ రోడ్డులో గోతుల్లో నీరు నిండిపోయి పలు ప్రమాదాలు చేసుకుంటున్నాయి ఈ రోడ్డు పనులు ఐదు నెలల క్రితమే ప్రారంభించిన నేటికీ అమల్లోకి రాకపోవడం విశేషం. ముగ్గురు నాయకులు ఉన్న ఈ మెయిన్ రోడ్డు పట్టించుకోనే నాధుడే లేడా అని ద్రాక్షారామ పరిసర ప్రాంతాల గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ రామచంద్రపురం లోనే ఉంటుండగా, వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఈ నియోజకవర్గంలోనే ఉన్న హసన్ బాద గ్రామానికి చెందిన ఎంపీ సుభాష్ చంద్రబోస్ ఈ ముగ్గురు నాయకులు నియోజకవర్గంలో ఉన్న ఈ రోడ్లు దుస్థితిపై ప్రజలు ప్రయాణికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

దీనిపై రహదారి భవనాల శాఖ అధికారులు నాయకులు స్పందించి చెరువులను తలపిస్తున్న ఈ రోడ్లకు గోతులు పూడ్చి అబివృద్ధి పనులు చేపట్టాలని ద్రాక్షారమ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న ద్రాక్షారామ-రామచంద్రపురం మెయిన్ రోడ్డు

అదివారపుపేట వెళ్ల మెయిన్ రోడ్డు

CHANGE OF NAME

I, SATYA SAI GANESH YERRAMSETTI, S/o. Varaha Mani Sekhar, R/o. D.No. 18-202/b, 3rd Street, Agraharam, Dowleswaram, Rajamahendravaram Rural, E.G.Dist., A.P. have changed My Mother's and My Father's Names **VIMALA YERARAMSETTI** and **VARAHA MANI SEKHAR YERARAMSETTI (Old Names)** to **VIMALA YERRAMSETTI** and **VARAHA MANI SEKHAR YERRAMSETTI (New Names).** Hence after all my documents and correspondence will be continued with My Mother's New Name **VIMALA YERRAMSETTI** and My Father's New Name **VARAHA MANI SEKHAR YERRAMSETTI.**

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 36/2021

బిట్వీన్:
వాడ్రేవు సీతారామాంజనేయ ప్రసాద్ ...వాది
మరియు
గిడుగు అనంతలక్ష్మి మరియు 2 అదర్స్
...ప్రతివాదులు
2) గిడుగు శివ లక్ష్మి బాల విజయ ప్రశాంతి, తండ్రి: లేటు నాగేశ్వరరావు, భర్త: వేణుమాధవ, డో.నెం. 4-150, గిడుగు వారి పాలెం, మొండెపులంక, పి.గన్నవరం మండలం.
3) గిడుగు దేవి రమామణి, తండ్రి: లేటు నాగేశ్వరరావు, డో.నెం. 4-150, గిడుగు వారి పాలెం, మొండెపులంక, పి.గన్నవరం మండలం.
...2, 3 ప్రతివాదులు

ఈ నెంబరులో వాది, చనిపోయిన మీ తండ్రి లేటు గిడుగు నాగేశ్వరరావు గారి నుండి తనకు రావలసిన ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం ఆయన యొక్క వారసులైన మీపై, మీ తల్లి గారి పై దాఖలు చేసిన పై నెంబరు దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిననూ తీసుకోనందున కోర్టు వారు పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు ఆర్డరు వేసినారు. సదరు దావా వాయిదా **ది.05-09-2023 అయి ఉన్నది.** కావున సదరు తేదీని పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పిటీషను పరోక్షమందు తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

శ్రీ ఎన్.వి.కె.శర్మ
అడ్వకేట్, అమలాపురం.
సెల్: 98491 42007